
శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

- బ్రిటీష్ హయాంలో భవన నిర్మాణం
- పూర్తిగా దెబ్బతిన్న పైకప్పు
- వర్షం పడితే తడుస్తున్న రికార్డులు, కంప్యూటర్లు



వర్షానికి తడిసి కాలిపోయిన వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు



తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పట్టలతో కప్పిన దృశ్యం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. బ్రిటీష్ హయాంలో నిర్మించిన భవనం పైకప్పు పూర్తిగా దెబ్బతింది. వర్షం పడితే అన్ని గదులు ఉరుస్తున్నాయి. దీంతో రికార్డులు, కంప్యూటర్లను కాపాడుకోవడం అధికారులకు తలకుమించిన భారంగా మారింది. ఆత్మకూరులో బ్రిటీష్ హయాంలో నిర్మించిన భవనంలో ఆత్మకూరు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గత కొన్నేళ్లుగా అధికారులు వర్షాకాలంలో కార్యాలయంపై పట్టలు కప్పి రికార్డులు, కంప్యూటర్లను కాపాడుకుంటూ వస్తున్నారు. అయితే గత మూడు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు పట్టలు కప్పినప్పటికి భవనం పైకప్పు నుంచి వర్షపునీరు ధారాపాతంగా కారడంతో కంప్యూటర్లతో పాటు వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు తడిసి కాలిపోయాయి. రెవెన్యూ రికార్డులు సైతం తడిసి ముద్దవగా వాటి ఆరబెట్టి భద్రపరిచేందుకు అధికారులు నానా పాట్లు పడ్డారు.

ఆర్డీఓ కార్యాలయంలోనే ప్రజాసమస్యల పరిష్కార వేదిక

మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిసోమవారం నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదికను ఇటీవల వెనుకగా ఉన్న ఆర్డీఓ కార్యాలయంలోకి మార్చారు. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడం, వీడియోకాన్ఫరెన్స్ పరికరం కాలిపోవడంతో ప్రజాసమస్యల పరిష్కార వేదికను ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలియక ఎంతో మంది తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వెనుదిరుగుతున్నారు. మరోవైపు ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను ఆర్డీఓకు విన్నవించేందుకు పెద్ద ఎత్తున వస్తుంటారు. మండల ప్రజలు సైతం అక్కడికే వెళ్లాల్సి రావడంతో ఒకింత ఇబ్బందులకు గురవుతున్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణం

గత పదేళ్ల క్రితం తహసీల్దార్ కార్యాలయం కోసం భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. పిల్లర్లు పోసి శ్లాబు వరకు నిర్మాణం చేపట్టారు. ఆ తరువాత భవన నిర్మాణాన్ని పూర్తి చేయకుండా వదిలేశారు. అప్పట్నుంచి అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది.

భవన నిర్మాణానికి చర్యలు

ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే, ఆర్డీఓ కార్యాలయంలోని ఓ గదిని ఖాళీ చేసి అందులో తాత్కాలికంగా తహసీల్దార్ కార్యాలయ నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. నిర్మాణ దశలో నిలిచిపోయిన భవనాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేసేలా చూస్తాం.

–ఆర్డీఓ భూమిరెడ్డి పావని, ఆర్డీఓ, ఆత్మకూరు



దెబ్బతిన్న తహసీల్దార్ కార్యాలయం పైకప్పు

పరామర్శ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకలకు చెందిన ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ అంకినపల్లి ఓబుల్‌రెడ్డిని నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఇటీవల ఓబుల్‌రెడ్డి సతీమణి మృతి చెందిన నేపథ్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సమీపంలోని నాలుగుకాళ్ల మండపం వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధుడు గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని గానుగపెంటపల్లి గ్రామానికి చెందిన జీ రామిరెడ్డి బస్టాండ్ నుంచి మెయిన్ బజారుకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో ఉదయగిరి డిపో నుంచి పంచాయతీ బస్టాండ్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు ఢీకొనడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు ఆటోలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ పరిపాలనాధికారి కే శ్రీనివాసులును సహచర సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకోవడంపై అభినందనలు తెలిపారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకు సత్కారం



ఉదయగిరి: స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డిని పోలీసు సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకోవడంపై అభినందనలు తెలిపారు. ఎస్సై ఏ శ్రీనివాసులు, సిబ్బంది అశోక్, ప్రశాంత్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓ తనిఖీలు



ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ విద్యారమ బుధవారం తనిఖీ చేశారు. వివిధ విభాగాలకు సంబంధించిన 28 రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ ఖాజానవాజ్‌కు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఎంపీడీఓ అప్పాజీ, ఏఓ సీహెచ్ పద్మజ, జూనియర్ అసిస్టెంట్ సమద్, డీఈఓ ఇమ్రాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



దుత్తలూరు: నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలను బుధవారం నిర్వహించారు. విజేతలకు ఏపీజీబీ మేనేజర్ టీ రాణిభారతి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఏపీజీబీ అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్వరి, క్యాషియర్ షాకీరా, హెచ్‌ఎం రవికుమార్ పాల్గొన్నారు.

చెరువు చేపల వేలం

కొండాపురం : మండలంలోని కొమ్మి పంచాయతీ పరిధిలోని మెయిన్ చెరువ చేపల వేలం ప్రక్రియను బుధవారం నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయంలో నిర్వహించిన వేలంలో సుమారు పది మంది రూ.10వేలు చొప్పున ధరావత్తు చెల్లించి పాల్గొన్నారు. వేలంలో కొమ్మికి చెందిన కూకట్ల వెంకటసుబ్బయ్య రూ.2,55,000 కు చెరువును దక్కించుకున్నాడు. ఈఓపీఆర్డీ నారాయణ, పంచాయతీ కార్యదర్శి పృథ్వీ, ప్రదీప్, వెంకటేశ్వర్లు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు. కాగా కొమ్మి పంచాయతీ పరిధిలోని గండికట్ల చెరువు చేపల వేలం ప్రక్రియను ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ ఏఈ రమేష్ తెలిపారు.

క్రీడాసామగ్రి పంపిణీ

వింజమూరు(ఉదయగిరి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గ్రైడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపట్నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

ఉదయగిరి: గండిపాళెంలోని పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయం ఆవరణలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను ఫిబ్రవరి 1,2, తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. 1న ఉదయం సంప్రోక్షణ, హనుమాన్ చాలీసా పారాయణం, నూతన విగ్రహాల గ్రామోత్సవం, సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, మండపారాధన, జలాధివాసం, అగ్నిప్రతిష్ట, 2న ఉదయం ప్రధాన దేవతల ఆవాహనం, విగ్రహ ప్రతిష్ట, తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే చర్యలు

ఆత్మకూరు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, దుకాణదారుల సరుకులను ఎస్సై ఎస్‌కే నజీర్ బుధవారం తొలగించారు. ఇకపై ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చినక్రాక మత్స్యకార సొసైటీ సభ్యుల మధ్య వివాదం



ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు

జలదంకి: మండలంలోని చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మత్స్యకార సొసైటీ సభ్యుల మధ్య బుధవారం వివాదం నెలకొంది. సొసైటీలో 574 మంది ఎస్సీలు సభ్యులుగా ఉన్నారు. 2020లో సొసైటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన కమిటీ నిబంధనల ప్రకారం ప్రతి కుటుంబానికి చేపలు అందిస్తూ సొసైటీని సఖ్యతగా నడిపించింది ఈ నెల 6వ తేదీతో సొసైటీ కమిటీ గడువు ముగిసింది. నిబంధనల ప్రకారం తిరిగి మత్స్యశాఖ అధికారుల సమక్షంలో కమిటీ ఎన్నికలపై సభ్యులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కాగా బుధవారం సొసైటీలోని పదిమంది సభ్యులు సభ్యత్వం లేనివారిని తీసుకొచ్చి చేపలు వదిలే ప్రయత్నం చేశారు. దీంతో మిగిలిన సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని వారితో వివాదానికి దిగారు. ఈ క్రమంలో వారి మధ్య తోపులాట జరిగింది. సమాచారం అందుకున్న కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్సై లతీఫున్నీసా ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడగా వివాదం సద్దుమణిగింది. చినక్రాక సొసైటీకి సంబంధించి మత్స్యశాఖ అధికారులు సభ్యులకు సరైన అవగాహన కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలున్నాయి.

నేటి నుంచి జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలు



ఆలయం ఎదుట సిద్ధం చేసిన యాగశాల

దుత్తలూరు: నర్రవాడలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలను గురువారం నుంచి ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయ కమిటీ చైర్మన్ మాదాల బాబురావు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. హోమాలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా హోమగుండాలను చేశారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు ఉదయం భగవత్ అనుజ్ఞ, గోపూజ, స్వస్తివాచనం, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ఆచార్య ఋత్విగ్వరణం, వాస్తు పూజ, వాస్తు హోమం, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవాచనం, మత్సంగ్రహణం, మేదిని పూజ, యాగశాల ప్రవేశం, అంకురార్పణ హోమం, అంకురార్పణ, ధాన్యాధివాసం , నివేదన, శాత్తుమురై, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



పరుగులో పోటీ పడుతున్న క్రీడాకారులు



క్రీడాకారిణులకు పతకాల ప్రదానం



క్రీడాకారులకు పతకాల ప్రదానం

కావలి: క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని విశ్వోదయ విద్యా సంస్థల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జవహర్ భారతి కళాశాలలో స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం నిర్వహించారు. డీఆర్ క్రీడా మైదానంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ సీ ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో జవహర్ భారతి డిగ్రీ,జూనియర్ కళాశాల క్రీడాకారులు, నర్సింగ్ కళాశాలల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. జేబీ కళాశాల కరస్పాండెంట్ వీ సుధాకర్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్ డా.పీ సుబ్రహ్మణ్యం నాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం శామ్యూల్‌రాజ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్టేర్ బ్యులా, డిగ్రీ కళాశాల స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు డా. ఆర్ మాల్యాద్రి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

కరవళ్ల ట్రస్టు సేవలు అభినందనీయం



క్రీడాకారిణి అర్చనకు దాతలు ప్రకటించిన నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న సీఐ

ఆత్మకూరు: కరవళ్ల వరదారెడ్డి ట్రస్టు ద్వారా రవీంద్రారెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆత్మకూరు జీ గంగాధర్ కొనియాడారు. మున్సిపల్ పరిధిలోని వెంకయ్యస్వామి ఆలయం వద్ద కరవళ్ల వరదారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు పింఛన్లు, వస్త్రాలు, విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అదృష్టం, అవకాశాలు కలిసి వచ్చి ఎందరో ఆర్థికంగా స్థితిమతులు అవుతుంటారని, అయితే సాయం చేసే మనస్సు ఉన్న వారికే సమాజంలో మంచిపేరు ఉంటుందన్నారు. ఆర్థికంగా స్థితిమంతుడు కాకపోయినా, మధ్యతరగతి కుటుంబీకుడైన కరవళ్ల రవీంద్రారెడ్డి తన తాత వరదారెడ్డి పేరుతో ట్రస్టును ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు. అనంతరం 30 మంది వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. నెలకు రూ.100 చొప్పున ఏడాదికి రూ.1200 నగదును అందజేశారు. 90 మందికిపైగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. నల్లపరెడ్డిపల్లి, బట్టేపాడు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. బట్టేపాడుకు చెందిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన ఆంధ్రా అర్చనకు రూ.10వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు చెంచురత్నం, దేపూరుకు చెందిన కే కృష్ణయ్య నాయుడు, ఉపాధ్యాయులు రామాంజనేయులు, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కావలివాసికి గౌరవ డాక్టరేట్



కావలి: పట్టణానికి చెందిన బట్టేపాటి విక్టర్ బాబుకు గౌరవ డాక్టర్ లభించింది. 'త్రి డైమెన్షనల్ ఆఫ్ మ్యాన్' అనే అంశంపై పరిశోధనలు సాగించినందుకు అంతర్జాతీయ డ్యాస్ప్రింగ్ థియోలాజికల్ వర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విశాఖపట్నంలోని క్రైస్ట్ చర్చిలో జరిగిన నేషనల్ ఇండిపెండెంట్ బిషప్ కౌన్సిల్ సమావేశంలో విక్టర్‌బాబుకు డాక్టరేట్‌ను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా విక్టర్‌బాబుకు నెల్లూరు క్రిస్టియన్ మైనార్టీ ఫోరం అధ్యక్షుడు పాడేటి థామస్, కావలి పాస్టర్ల సంఘ అధ్యక్షుడు ఆకుల ఏసుబాబు, షిఫ్ట్ టీం కోఆర్డినేటర్ కృపారావు, కన్వీనర్ చంద్రశేఖర్, మినిస్ట్రీస్ జీసెస్‌పాల్, మినిస్ట్రీస్ పాస్టర్ జోసెఫ్, తదితరులు అభినందనలు తెలిపారు.

మౌలిక వసతుల పరిశీలన



ఉదయగిరి: మండలంలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతులను సీఆర్టీఏ డీఆర్పీ జీ కళ్యాణ్ బుధవారం పరిశీలించారు. పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జీ చెరువుపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి వసతులను పరిశీలించారు. అనంతరం పీఎంసీ సమావేశం నిర్వహించి పాఠశాలల స్థితిగతులపై చర్చించి నివేదికను అందజేస్తామని ఆయన తెలిపారు. హెచ్‌ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహ, విశ్రాంత హెచ్‌ఎం ఖలీం, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దుత్తలూరు: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి

ఆత్మకూరురూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత అజెండాలోని అంశాలపై చర్చించారు. అనంతరం తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖకు సంబంధించిన కార్యక్రమాల అమల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని దేపూరు సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించి ఏఓ కిషోర్ బాబు ఇకపై తమ శాఖ తరుపున ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఇచ్చి పనిచేస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సర్దుమణిగింది. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14లోగా అన్ని పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునరుద్ధరించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. ఇందుకోసం 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్‌లు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో మండలాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలి



ఉదయగిరి: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ఆంజనేయనాయక్



చేజర్ల మండలం మడపల్లిలో..

చేజర్ల: వరి పంటకు ఎలుకలు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తాయని మండల వ్యవసాయాధికారి శశిధర్ తెలిపారు. మండలంలోని మడపల్లిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. రైతులు సామూహికంగా ఎలుకల నివారణ చేపడితేనే ఫలితం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం బ్రోమోడైలిన్ ఎలుకల మందును ఉచితంగా అందజేస్తుందన్నారు. అనంతరం ఎలుకల మందు కలిపే విధానం, బొరియల వద్ద పెట్టే విధానంపై అవగాహన కల్పించారు. వీఏఏ మమత, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉదయగిరి: రైతులు పంటలసాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏఓ ఆంజనేయనాయక్ సూచించారు. మండలంలోని నేలటూరులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలను సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగును రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నాబార్డ్ ఎన్జీఓ ఆర్గనైజర్ నాగలక్ష్మి, ఎఫ్‌పీఓసీఓ సురేష్, ఏఈఓ వినోద్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల కల్పనపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

సీతారామపురం: ఉపాధిహామీ పనుల కల్పనపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలును మరిచినందున అధికార యంత్రాంగమైనా ప్రజా సంక్షేమానికి బాధ్యత వహించాలన్నారు. గ్రామీణులకు ఉపాధి పనులు కల్పించే వలసలను అరికట్టాలన్నారు. సీతారామపురం బిట్–1 ఎంపీటీసీ పీసీ అల్లూరురాజు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ధ్వజమెత్తారు. పైప్‌లైన్ గుంతలను సకాలంలో పూడ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి



ఆత్మకూరులో ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సైలు



మర్రిపాడు: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంవీఐ, వైద్యసిబ్బంది



సంగంలో మాట్లాడుతున్న అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని ఆత్మకూరు సీఐ జీ గంగాధర్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు హెల్మెట్ ప్రాధాన్యతపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలవడం వల్లే ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా మరణిస్తున్నారని తెలిపారు. హెల్మెట్‌ను ధరించడం వల్ల ప్రాణరక్షణ పొందవచ్చని చెప్పారు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా,అతివేగంగా వాహనాలను నడపరాదని సూచించారు. ఎస్సై షేక్ జిలానీ, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం నిర్వాహకులు కే ప్రదీప్‌రెడ్డి, డీ హరికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్రిపాడు: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యసిబ్బందికి ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు ప్రమాద బాధితులకు తక్షణ సాయం చేసే చట్టంపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అలాగే ప్రాణాలు కాపాడే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకంగా నగదు అందజేస్తుందని తెలిపారు. ఈ చట్టంపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. వైద్యాధికారి అశోక్ కుమార్, రోడ్ సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ పి స్వరూపరాణి పాల్గొన్నారు.

సంగం: స్థానిక వెలుగు కార్యాలయంలో ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించారు. తహసీల్దార్ సోమ్లానాయక్, ఆత్మకూరు ఎంవీఐ రాములు, ఈఓపీఆర్డీ వరప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరై రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసే చట్టంపై అన్ని శాఖల సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఆర్‌ఐ, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.